

క్రేన్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

# స్వార్థానికి మరోపేరు త్యాగమా?!

-భువనగిరి శేషమాంబ.

"అమ్మా ! " ఆర్తనాదంలా అరిచింది శారద. తన జుట్టు ప్రకాశం చేతిలో బిగుసుకుంటోంది.

"మూగముండా! నిన్ను కట్టుకుని సుఖపడి చచ్చిందేముంది! ఒక మాటా ! మంచా! వికృతపు అరుపులు చేష్టలు తప్ప, నువ్వు చచ్చిన మరునాడే నాకు శాంతి!". దబ దబా శారద వీపు మీద దెబ్బలు పడ్డాయి. తట్టుకోలేని శారద విలవిలలాడింది. పిల్లలు ముగ్గురూ బిక్కముఖాలతో నిలబడ్డారు.

దభేల్న శారదని ఒక్క తోపు తోసి "పాపిష్టి ముఖమా! ఈ ఇంట్లో సుఖం, శాంతి లేవు. ఈ దరిద్రాన్ని నాకంటగట్టారు". అంటూ విసవిసా బయటకు వెళ్ళాడు శారద భర్త ప్రకాశం.

స్కూటర్ స్టార్టయిన శబ్దాన్ని విని.పిల్లలు ముగ్గురూ తల్లిని చుట్టుకుని బావురుమన్నారు.

శూన్యంలోకి చూస్తున్న శారదకి గతం కళ్ల ముందు గిర్రున తిరిగింది.

☆ ☆ ☆

"ఏమేవ్! నిన్నే!!" పరంధామయ్య అరుస్తూ వెలిగిపోతున్న ముఖంతో భార్యని పిలుస్తూ ఇంట్లోకి హడావిడిగా వచ్చాడు. అతని చేతిలో ఉత్తరం.

"అబ్బ! వస్తున్నానండి! ఏమిటి హడావిడి! అమ్మాయ్ శారదా! కాస్త ఇటొచ్చి కూర కలేబెట్టు తల్లీ. మాడిపోతుంది" అంటూ అమ్మ తడిచేతులు చెంగుకు తుడుచుకుంటూ తనకి పని పురమాయించటం, తలుపుచాటునుంచి చూస్తూ ఆ ఉత్తరం ఎక్కడినుంచి వచ్చిందో ఊహించిన తన గుండె కొట్టుకోవటం ఒకేసారి జరిగాయి.

వంటింట్లో కూర కలేబెడుతున్న శారదకి తండ్రి మాటలు వినిపిస్తున్నాయి. "చూసావా! వరం! నా మేనల్లుడంటే ఏమనుకున్నావే? మేలిమి బంగారం. అమ్మాయిని చేసుకోవడానికి యిష్టపడ్డాడు ప్రకాశం! ఇదిగో! ఇప్పుడే ఉత్తరం వచ్చింది. ఏది ఏమైనా మా అక్కయ్య మనసు మహాదొడ్డది! దానికి తగ్గ కొడుకే వాడూను! భగవంతుడు మన యందున్నాడు. ఈ మాటరాని మూగపిల్ల జీవితం ఎలా తెల్లవారుతుందా అని బాధపడే మనని ఒక ఒడ్డుకు చేర్చాడు. ఎంతైనా రక్త సంబంధం ఊరికే పోతుందా!" నాన్న తెగసంబరపడి పోతున్నారు. జరగబోయే శుభకార్యాన్ని తలచుకొని. అమ్మ పరుగున వంటింట్లోకి వచ్చి "నా బంగారు తల్లీ! నిన్ను చేసుకోవడానికి మీ బావ ఒప్పుకున్నాడే! ఇక మా దిగులు తీరిందే అమ్మా!" అంటూ ఆవేశంతో నన్ను చుట్టుకుని కనిపించని దేముళ్ళందరికీ దణ్ణాలు పెట్టింది. నాకు మాత్రం మనసులో చిన్న సందేహం!!. వాళ్ళు డబ్బుకాశపడి నన్ను చేసుకోవడానికి ఒప్పుకోలేదు కదా!

ఆ తరువాత కార్యక్రమాలన్నీ చకచకా జరిగిపోయాయి. నాన్న బావకి బ్యాంకులో ఉద్యోగం వేయించడం, దాని కోసం చాలానే డబ్బు ఖర్చుపెట్టడం, అదీకాక ఉన్న ఆస్తిలో మూడు వంతులు బావ

పేరున రిజిస్టర్ చేయించడం వగైరాలన్నీ జరిగాక పచ్చని పందిట్లో బంధు మిత్రుల సందట్లో బావ నా మెళ్ళో తాళి కట్టడం జరిగింది! అమ్మా నాన్నల కళ్ళల్లో కోటి కాంతుల వెలుగు చూశాను! గుమ్మం దగ్గర పేర్లు చెప్పే తంతు! ఆడపడుచులు వదిన గార్ని, మరదళ్ళు బావగార్ని ఆటపట్టించే అవకాశం! దాన్నెవరూ జారవిడుచుకోరు.

పిన్ని కూతురు శ్యామల పెంకిది! పెద్ద వాళ్ళు ముందు చూపుతో ఈ తంతు వద్దన్నా వినకుండా! ''బావగారూ! మిమ్మల్ని కదలనివ్వను! మా అక్క పేరు చెప్పందే లోపలికి పోనివ్వను'' అంటూ హఠం చేయటం! వెంటనే ఆడపడుచు వచ్చి "మా అన్నయ్య భార్య పేరు చెపుతాడు సరే! మరి మీ అక్కయ్యను తన భర్త పేరు చెప్పమను చూద్దాం" అంటూ వేళాకోళం చేయటం, బావ ముఖం మాడిపోవటం అంతా క్షణాల్లో జరిగిపోయింది. నా తల దాచుకోవ టానికి పాతాళం ఒక్కటే మార్గం! నలుగురూ చేరి శ్యామలను చివాట్లు వేయటం, అది భోజనం చేయనని ఏడుస్తూ కూర్చోవటంతో ఆ సరదా ఆ విధంగా ముగిసింది.

అలకపాన్పుమీద కోరికగా స్కూటరు, ఆడపడుచులకు లాంఛనాలు అన్నీ యధావిధిగా వసూలు చేసుకున్నారు.

"మూడునిద్దర్ల"ముచ్చట అతి పేల వంగా ముగిశాక, అత్తవారింటికి వెళ్ళేరోజు—

''అక్కయ్యా! ఒక్కగానొక్కపిల్ల. గారాబంగా చూశాను. లేక లేక పుట్టింది! ఇవన్నీ నీకు తెలియవని కాదు. లోపమున్నా పెద్దమనసుతో దాన్ని చేసుకున్నారు. చిన్నతనం వల్ల ఏదైనా పొరపాటు చేస్తే కడుపులో పెట్టుకో!" నాన్న అత్తయ్య చేతులు పట్టుకొని కళ్లనీళ్లు పెట్టుకున్నారు. అమ్మ బాధ తట్టుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తోంది.

''నర్లేరా! ఇంతగా చెప్పాలా! మూగమొద్దు దాంతో నాకు మాటా మాటా వచ్చే అవకాశం కూడా లేదు!. నువ్వు నిశ్చింతగా వుండు". అత్తయ్య ఏ భావంతో అన్నా, ఆ మాటలు నా గుండెలో శూలంగా దిగాయి. నాన్న బావ దగ్గరకు వెళ్ళటం, ఏదో చెప్పబోవటం, బావ ముఖం తిప్పుకోవటం నాకు స్పష్టంగా కనిపించింది! మనసంతా వెలితితో నిండింది.

అత్తవారింట అడుగు పెట్టినప్పటి నుంచి అసలైన బాధలు ఆరంభమయినాయి.

మాటలొక్కటి రాకపోవటం లోపం తప్ప అన్ని పనులు చేసే నేర్పు నాలో వుంది. అమ్మ ఆ విధంగా అలవాటు చేసింది. నా అదృష్టం కొద్దీ మూగవాళ్ళల్లో సహజంగా వుండే చెముడు నాకు లేదు. ఎవరెంత చిన్నగా మాట్లాడుకున్నా నాకు స్పష్టంగా వినపడేది.

ఆ రోజు పొద్దున్న బాత్రూం నుంచి స్నానం చేసి వస్తున్న నాకు చిన్నాడపడుచు, అత్తయ్య చిన్నగా మాట్లాడుకున్నది స్పష్టంగా వినిపించింది. "అమ్మా! వదిన గురించి మా ఫ్రెండ్స్ అందరూ మీ అన్నయ్యకి మూగదాన్ని చేసుకున్నారేమిటే అని అడుగుతుంటే సిగ్గుగా వుందే! ఎందుకిలా చేశామా అని అనిపిస్తోంది" అని అంటున్న కూతురితో "ఒసేయ్! పిచ్చి మొహమా! నా తమ్ముడంటే ప్రేమతో వాడి కూతుర్ని చేసుకున్నామా! వాడు సంపాయించిన ఆస్తిపాస్తుల్ని చూసిగానీ! మన పరిస్థితికి ఇంత ఆస్తితో పిల్లనిచ్చేదెవరే? అన్నయ్యకి బ్యాంకు ఉద్యోగం ఎలా వచ్చేది?'' ఇంకా ఏదో చెప్పబోతున్న అత్తయ్య నన్ను చూసి చటుక్కున మాటలాపేసింది. నేను నా గదిలోకి వెళు తుండగా వెనక నుంచి "అమ్మా! ఒదిన మన మాటలు విన్నదేమోనే!" అన్న కూతురు మాటలకి "దాని మొఖం! వింటే మాత్రం కొంప మునిగేదేముంది! ఎవరితోనన్నా చెప్పగలదా!" అత్తయ్య మాటల్లో ధీమా నా గుండెని చీల్చి చెండాడింది.

నాన్న యిచ్చిన కట్నం డబ్బులతో చిన్న ఇల్లు ఏర్పడింది. పెళ్ళి సందర్భంగా నాకు వచ్చిన కానుకలు, కట్నాలతో ఇల్లు నిండింది. బావ ఉద్యోగంతో ఇంటి అవసరాలన్నీ తీరుతున్నాయి. అన్నీ అమరిన తరువాత వాళ్ళకి ఒక్కటే లోటు కనిపిస్తోంది. అది కోడలి మూగతనం. దాని వల్లే అన్నీ అమిరాయన్న సంగతి మర్చిపోయినట్లున్నారు.

నా దౌర్భాగ్యానికి తోడు అగ్నికి ఆజ్యం పోసినట్లు ఒక సంఘటన జరిగింది.

ఆ రోజు! ....

"అమ్మా! అమ్మా!! " గావుకేకలు వేసు కుంటూ స్కూటరు దిగి బావ ఇంట్లోకి రావటం చూసి అత్తయ్య "ఒసేవ్! మూగమొద్దా! వాడేమిటో అరుస్తున్నాడు చూడు" అంటూనే ''అయినా! నామొఖం! వాడేమడిగినా చెక్కబొమ్మలా నిలబడటం తప్పించి నువు తిరిగి జవాబు చెప్పే అవకాశమేదీ?" అని దీర్ఘం తీస్తూ "నీ ఖర్మ ఇలా కాలింది" అని గొణుక్కుంటూ "వస్తున్నారా! నాయనా!" అంటూ వచ్చిన తల్లితో బావ "అమ్మా! మొన్న చెప్పానే ! మా కొలీగ్ అదే నాతో పనిచేసే అతనికి పెళ్ళైయిందని. అతనూ, అతని భార్య రేపు మనింటికి వస్తున్నారు. టీ కి పిలిచాను" అంటూ అక్కడే వున్న నా వంక చూడకుండా సరాసరి పెరట్లోకి వెళ్ళిపోయాడు. దీర్ఘమైన నిట్టూర్పు నాలోంచి దూసుకువచ్చింది.

అనుకున్నట్టుగా ఆ మరునాడు చిలుకా గోరింకల్లా అనిపించే ఆ కొత్త జంట మా ఇల్లు పావనం చేసారు. ఆ అమ్మాయి వసపిట్టలాగా ఒకటే కబుర్లు. మా ఆయన హడావిడి అంతా యింతా కాదు. అత్తయ్య ఆ అమ్మాయి మాట్లాడుతుంటే మురిపెంగా చూడటం ఇవన్నీ నేను వంటింట్లో నుంచి గమనిస్తూనే వున్నాను. జీడిపప్పు పకోడీలు రుచిగా చేయాలని బావ హుకూం. ఆ పనిలో నేను తలమునకలై వుండగా అత్తయ్య వంటింట్లోకి వచ్చి "పిల్ల కుందనపు బొమ్మలా వుంది! గలగలా ఎంత కలివిడిగా మాట్లాడుతుందో! ఎన్నాళ్లకి ఇంట్లో సందడిగా మాటలు వినిపిస్తున్నాయ్" అంటూ "ఏమే! ఇంకా పకోడీలు అవలేదా? తొందరగా తెమిలి కాస్త తల అది దువ్వుకుని మంచి చీర కట్టుకో! వాళ్ళకి పలహారాలు పెట్టాలి కదా!" అంటుంటే మర్చిపోయి నా సహజ ధోరణిలో అత్తయ్యకి సమాధానం చెప్పేసాను వికృతమైన అరుపులతో. అంతే! ముందు హాల్లో వున్న ముగ్గురూ మాటలాపేసినట్టున్నారు. వాతావరణం నిశ్శబ్దంగా మారిపోయింది. వడివడిగా బావ కందగడ్డలాగా మొహం పెట్టుకొని వంటింట్లోకి రావటం నా చెంప చెళ్లుమనిపించటం క్షణంలో జరిగిపోయింది.


నా కళ్ళు బైర్లు క్రమ్మినట్లయింది. అత్తయ్య మౌనంగా పెరట్లోకి వెళ్ళింది. ముందు హాల్లో నుంచి సన్నగా మాటలు వినిపిస్తున్నాయి "డబ్బు కాశవడి మూగమ్మాయిని చేసుకున్నట్టున్నాడు" బావ ఫ్రెండ్ భార్యతో గుసగుసగా అంటున్నాడు. "అలాగా!" ఆ అమ్మాయి ఆశ్చర్యంగా అంటోంది! వాళ్ళ మాటలు మాకు స్పష్టంగా వినిపిస్తున్నాయి. నా వైపు చీదరగా చూసి బావ, ముఖానికి కొంచెం నవ్వు పులుముకుని హాల్లోకి వెళ్ళి వాళ్ళతో మాటలు కలపటం, తరువాత అత్తయ్య రావటం, ప్లేట్లల్లో పలహారాలు సర్ది వారికి ఇవ్వటం, అవి తిని వారు వెళ్ళిపోవటం అంతా అసహజంగా, నాటకీయంగా కృత్రిమ వాతావరణంలో చకచకా జరిగిపోయాయి. వెళ్ళే ముందు వాళ్ళు బావ వంక హేళనగా చూడటం నా కంటి చూపు దాటిపోలేదు.

ఆరోజు నుంచి తన బ్రతుకు పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టయ్యింది. ప్రతి క్షణం అత్తయ్య నుంచి, బావ నుంచి నిరసనలూ, చీదరింపులూ ఎదుర్కొంటూ జీవితం నెట్టడం చాలా దుర్భరంగా వుంది.

కాలచక్ర భ్రమణంలో ఏళ్ళు దొర్లి పోయాయి. ఏది ఏలా వున్నా ప్రకృతి తన ధర్మం తాను నిర్వర్తిస్తుందనటానికి నిదర్శనం తను ముగ్గురు పిల్లల తల్లవటం. తన జీవన సరళిలో ఏ మార్పు లేకపోయినా ఆ ఇంట్లో మాత్రం చాలా మార్పులు వచ్చాయి. బావకు మేనేజరుగా ప్రమోషన్ రావటం, ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు తనకు పుట్టింటి వారిచ్చిన ఆస్తిపాస్తులతో జరగటం, అత్తయ్య మంచాన పడటం, తన తల్లిదండ్రులు చనిపోయి తను మరీ వంటరితనంతో దిక్కులేనిదవటం ---

"అమ్మా! అమ్మా!! పెద్ద బాబు తనని కుదిపేస్తుంటే ఆలోచనా తరంగాలు చెల్లా చెదరయ్యాయి. కళ్ళు తుడుచుకుని ఏవిటన్నట్లు వాడివంక చూశాను. వాడి చేతిలో న్యూస్ పేపర్. అది నాకు చూపిస్తూ "అమ్మా! ఇందులో డాడీ ఫొటో వేశారు" అంటూ చదవమని పేపర్ నా చేతికిచ్చాడు. బాక్స్ కట్టిన మేటర్ అందులో బావ ఫొటో క్రింద ఉన్నత భావాలు గల ప్రకాశం ఒక మూగమ్మాయిని చేసుకున్న విశిష్ట వ్యక్తిగా, అతని త్యాగాన్ని ఒక ప్రముఖ సేవా సంస్థ గుర్తించి అవార్డుతో సత్కరిస్తున్నట్లుగా రాసారు.

అది చదివిన శారదకి ప్రకాశం తనని పెళ్ళి చేసుకోవటం త్యాగమా? అయితే స్వార్థానికి మరోపేరు త్యాగమేనా అన్న భావన కలిగి కళ్ళుండీ సత్యమేమిటో చూడలేని మనుషుల మీద జాలిపడుతూ పేపర్లో ప్రకాశం ఫొటోవంక చూస్తూ పేలవంగా నవ్వుకుంది.




# నానీలు

సోమేపల్లి వెంకటసుబ్బయ్య

తెలుగుతనం
వెల్లి విరుస్తోందా
అయితే
అది జీవమున్న పల్లే...

యూజ్ అండ్ త్రో
ఈనాటి సంస్కృతి
పురోగమనంలో
వృద్ధాశ్రమాలు

ఎటియం అంటే
ఎంతో ప్రేమ
అచ్చం అలాంటి భార్య కోసమే
అన్వేషణ

అల్లంత దూరాన
కమనీయ దృశ్యం
భూమి ఆకాశం
ముద్దాడుకుంటూనే....

బతికినన్నాళ్ళూ
ఉప్పు నిప్పు
సమాధులైనాక మాత్రం
సహజీవనం

అమ్మా నాన్న
వృద్ధాశ్రమంలో
తల్లిలాంటి భాషకోసమేమో
తెగతాపత్రయం....!?